సాక్షి
నల్లగొండ
గురువారం । 17 । జూలై । 2025



అధిక వడ్డీ ఆశ చూపి..

అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి డబ్బులు వసూలు చేసి ఉడాయించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



కొనసాగుతున్న నాటకోత్సవాలు

నల్లగొండ పట్టణంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	559.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	66,745 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	6,193 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	4,347 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,650 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ : జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు -2025 కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువును పొడిగించినట్లు డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 17లోగా రిజిస్ట్రేషన్, 20లోగా ఫైనల్ సబ్‌మిషన్ చేయాలని పేర్కొన్నారు. ఫైనల్ సబ్‌మిషన్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తగిన ఆధారాలు జతపరిచి వారి ఫొటోలు, వీడియో పెన్‌డ్రైవ్‌లో వేసి మూడు ప్రతులు ఎంఈఓ ద్వారా డీఈవో కార్యాలయంలో ఈ నెల 22లోగా సమర్పించాలని సూచించారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ రమణారెడ్డి

చందంపేట : భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ సర్వేకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కోరారు. బుధవారం చందంపేట మండలంలోని అచ్చంపేటపట్టి గ్రామంలో నిర్వహించిన భూ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు పెట్టుకున్న రైతులకు సంబంధించి వ్యవసాయ భూములను క్షేత్రస్థాయిలో సర్వేయర్ల బృందం సర్వే నిర్వహిస్తుందని, సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలన్నారు. త్వరలోనే బొల్లారం, కంబాలపల్లి, పొగిళ్ల, రేకులగడ్డ, చిత్రియాల గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఆర్‌ఐ సురేష్, హబీబ్, అనిల్ ఉన్నారు.

ఆదర్శ హాస్టల్ తనిఖీ



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను డీఈఓ భిక్షపతి బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో సోమవారం 18 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా సిబ్బంది వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ విషయంపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు పాఠశాలలో విచారణ చేపట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం చండూరు ఆర్డీఓ వి.శ్రీదేవి సైతం హాస్టల్‌ను తనిఖీ చేసి వంట సామగ్రిని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ జి.చినముసయ్య, ఎస్‌ఓ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

అమృత్ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్

నల్లగొండ టూటౌన్ : అమృత్ పథకం ద్వారా చేపడుతున్న తాగునీటి ట్యాంక్ పనులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సీడీఎంఏ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ పి.శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నీలగిరి పట్టణంలో అమృత్ స్కీం ద్వారా చేపడుతున్న తాగునీటి ట్యాంకుల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పనుల్లో నాణ్యత ఉండేలా ప్రజారోగ్య శాఖ మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పనులన్నీ సకాలంలో పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ మనోహర్ , ఏఈ నాగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9,23,449 ఎకరాలకు నీరు

ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రణాళిక ఖరారు

- సాగర్, మూసీ, ఎస్సారెస్పీ, ఏఎమ్మార్పీ, ఎత్తిపోతల పథకాల కింద నీరు
- ఆన్ ఆఫ్ పద్ధతిలో నీరివ్వాలని సూచించిన రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ
- ఎస్సారెస్పీ, డిండి కింద ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదల
- సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగితే ఈ నెల 20న, లేదంటే ఆగస్టు 1న ఎడమకాల్వకు నీరు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీటి విడుదల ప్రణాళికను రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ ఖరారు చేసింది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ, ఆసిఫ్‌నహర్, డిండి, ఎస్సారెస్పీ స్టేజ్- 2, మూసీ, ఎత్తిపోతల పథకాల కింద వానాకాలంలో మొత్తం 9,23,449 ఎకరాల్లో పంటల సాగుకు నీటిని విడుదల చేసేందుకు కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నీటిని వృథా చేయకుండా ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆయా ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఈ మేరకు జిల్లాలోని సాగునీటి పారుదల శాఖ అధికారులు షెడ్యూల్ ఖరారు చేసి నీటిని విడుదల చేయనున్నారు.

నీటి కేటాయింపులు ఇలా..

- నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద నల్లగొండ జిల్లాలో 1,44,727 ఎకరాల ఆయకట్టు ఉండగా.. వానాకాలం సాగుకు 16.50 టీఎంసీల నీటిని కేటాయించారు. ఇక ఏఎమ్మార్పీ, ఎస్‌ఎల్‌బీసీ కింద 2,76,461 ఎకరాల ఆయకట్టు ఉండగా.. 28 టీఎంసీల నీటికి ఇవ్వనున్నారు.
- ఆసిఫ్‌నహర్ కింద 15,245 ఎకరాలకు 1.5 టీఎంసీల నీరు కేటాయించారు.
- డిండి ప్రాజెక్టు కింద 12,975 ఎకరాలకు సాగు నీరు అందించాలని నిర్ణయించిన కమిటీ వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా ఎంత నీటిని విడుదల చేయాలన్నది నిర్ణయించాలని స్పష్టం చేసింది. నీటి కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.
- సూర్యాపేట జిల్లాలో సాగర్ ఎడమకాల్వ కింద ఎత్తిపోతల పథకాలతో కలుపుకుని 2,29,961 ఎకరాల ఆయకట్టు ఉండగా వానాకాలం సాగుకు 18 టీఎంసీల నీటిని కేటాయించింది.
- ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద సూర్యాపేట జిల్లాలో 2,14,080 ఎకరాలకు నీటిని ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. అయితే శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా ఎంత నీటిని విడుదల చేయాలన్నది ఖరారు చేయాలని సూచించింది.
- మూసీ ప్రాజెక్టు కింద 30 వేల ఎకరాలకు 4.28 టీఎంసీల నీటిని ఇవ్వాలని నిర్ణయించింది.

వరద పెరిగితే 20వ తేదీ నుంచి నీటి విడుదల

ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉండటంతో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు వస్తున్న వరదనీరు (ఇన్‌ఫ్లో) 60 వేల క్యూసెక్కుల వరకు తగ్గిపోయింది. ఈ నాలుగైదు రోజుల్లో వర్షాలు పెరిగి శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంటే ఈ నెల 20వ తేదీ నుంచి ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. లేదంటే ఆగస్టు 1వ తేదీ నుంచి సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు.

18 నుంచి మూసీ కాలువలకు నీరు

- ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నాలుగు విడతల్లో..

కేతేపల్లి : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వానాకాలంలో ఆరుతడి పంటల సాగుకు నీటిని విడుదల చేసేందుకు సూర్యాపేట జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు బుధవారం షెడ్యూల్ ఖరారు చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నాలుగు విడతలుగా నీటిని విడుదల చేయనున్నారు. తొలి విడత 25 రోజులు, ఆతర్వాత మూడు విడతలు ఒక్కో విడతకు పదిహేను రోజుల విరామంతో విడతకు 15 రోజులు పాటు (మొత్తం 79 రోజులు) ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నంత వరకు నీరు ఇచ్చే విధంగా షెడ్యూల్ రూపొందించారు. మొదటి విడత ఈనెల 18 నుంచి ఆగస్టు 12 వరకు, రెండవ విడత ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 11 వరకు, మూడవ విడత సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 11 వరకు, నాలుగవ విడత అక్టోబర్ 26 నుంచి ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నంత వరకు కాలవ్వలకు నీటిని విడుదల చేయనున్నటుల్ అధికారులు తెలిపారు. మూసీ ప్రాజెక్టు గరిష్టస్థాయి నీటి మట్టం 645 అడుగులు(4.46 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 641.39 అడుగుల (3.54 టీఎంసీలు) నీరు ఉంది. మూసీ నీటితో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 35 వేల ఆయకట్టు సాగులోకి రానున్నాయి. ఇప్పటికే సాగు పనుల్లో బిజీగా ఉన్న రైతులు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యతోనే మెరుగైన జీవితం



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిడమనూరు : విద్యతోనే మెరుగైన జీవితం, ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నిడమనూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆమె సందర్శించారు. రాత్రి 8.30 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఈ సందదర్భంగా విద్యార్థినులతో ముచ్చటించారు. తాను ఉత్తరప్రదేశ్ లక్నో నుంచి నల్లగొండకు కలెక్టరుగా వచ్చానని.. చదువుకుంటే ఎక్కడికైనా వెళ్లవచ్చని, ఏదైనా సాధించవచ్చని చెప్పారు. పాఠశాల గోడపై ఉన్న హిందీ స్లోగన్స్‌ను విద్యార్థినులతో చదివించారు. పలు ప్రశ్నలు అడిగి చాక్లెట్లు ఇచ్చారు. 9వ, 10వ తరగతి విద్యార్థినులు తమ సహచర 6వ, 7వ, 8వ తరగతి చిన్నారుల ఆరోగ్యం, విద్యలో సలహాలు అందిస్తూ, మంచిగా చూసుకుంటే.. 9వ, 10వ తరగతి విద్యార్థులను డిసెంబరు 25న హైదరాబాద్ టూర్‌కు పంపుతానని, ఇంటర్‌లో ప్రథమ ర్యాంకు సాధిస్తే విమానం ఎక్కే అవకాశం కల్పిస్తానని చెప్పారు. విద్యాలయంలో మరమ్మతు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని ఏఈకి సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎండీఓ వెంకటేషం, ఎంఈఓ ఎల్.వెంకన్న, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు ఉన్నారు.

భూ భారతి సమస్యలు పరిష్కరించాలి



దరఖాస్తులపై చర్చిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు : భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె చండూరు ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీదేవితో సమావేశమయ్యారు. రేషన్‌కార్డుల పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. చెర్లగూడం రిజర్వాయర్ బాధితులు ఇటీవల పనులను నిలిపివేసిన విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ పద్మ, డీటీ పరమేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ నిర్మల, ఆర్‌ఐ ప్రసన్న ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డివి అబద్ధపు ప్రచారాలు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, చిత్రంలో భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

రామగిరి(నల్లగొండ) : సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలతో కాలం గడుపుతున్నాడని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి సభలో రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ మీద రాజకీయ దురుద్దేశంతో మాట్లాడారన్నారు. కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై అవాకులు చవాకులు మాట్లాడడం తగదదన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 6.47 లక్షల రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. సభలో రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల మీద ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చీకటి ఒప్పందాల కోసం మోదీని కలుస్తారని.. కానీ బీసీ రిజర్వేషన్ గురించి ఎందుకు అడగడం లేదన్నారు. జగదీశ్‌రెడ్డి మీద వ్యక్తిగత ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను పారించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తక్షణమే సాగర్ ఎడమ కాల్వకు నీరిచ్చి నారుమళ్లను కాపాడాలన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నాయకులు నిరంజన్ వలి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, కటికం సత్తయ్య గౌడ్, పంకజ్ యాదవ్, ప్రసన్నరాజ్ పాల్గొన్నారు.

‘స్థానిక’ స్థానాలు ఖరారు

జిల్లాలో 33 చొప్పున జెడ్పీటీసీలు, ఎంపీపీలు, 353 ఎంపీటీసీలు

- కొత్తగా పెరిగిన 4 ఎంపీటీసీలు, 2 జెడ్పీటీసీలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికారులు



నల్లగొండ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల వారీగా స్థానాలను ఖరారు చేసి జాబితాలను వెల్లడించింది. దీంతోపాటు స్థానిక పోరుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు సైతం అందాయి.

పెరిగిన నాలుగు ఎంపీటీసీ స్థానాలు

జిల్లాలో 2019లో జరిగిన ఎన్నికల్లో జిల్లాలో 31 చొప్పున జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు మండలాలు పెరిగాయి. దీంతో ఎంపీపీ, జెడ్పీ స్థానాల సంఖ్య 33కు చేరింది. ఇక గతంలో 349 ఎంపీటీసీ స్థానాలుండగా ఎంపీటీసీ నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా 4 స్థానాలు పెరిగాయి. ఆ ఎంపీసీటీల సంఖ్య 353క చేరింది. పెరిగిన స్థానాలన్నింటిని జిల్లా అధికారులు జాబితాను ప్రభుత్వానికి పంపడంతో ప్రభుత్వం వాటిని నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

యంత్రాంగానికి ఆదేశాలు..

స్థానిక సంస్థల స్థానాలు ఖరారు కావడంతో ఇక గ్రామాల్లో ఎన్నికల సమరభేరీ మోగనుంది. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలకు కావాల్సిన మెటీరియల్, అధికారులు, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో, డీపీవోలు, పోలీస్‌శాఖకు ఆదేశాలు అందాయి.

ఆర్డినెన్స్‌పై ఉత్కంఠ!

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ బిల్లుపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. గవర్నర్ ఆమోదిస్తారా.. లేక తిప్పిపంపుతారా అన్న చర్చ సాగుతోంది. ఒక వేళ గవర్నర్ ఆమోదిస్తే దాని ఆధారంగా రిజర్వేషన్ల ఖరారు కానున్నట్లు తెలుస్తోంది.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికై తీసుకోవాలిన్సన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీ, విద్యుత్, రోడ్లు తదితర సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఐదు వార్డుల చొప్పున ఆయా కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, చిరు వ్యాపారుల సమస్యలు, రోడ్డు మీద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 2వేల ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు గాను ఇసుక కొరతను నివారించేందుకు స్యాండ్ బజార్ ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో ప్రతినెలా ఆదాయం

- హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ బి.బాబు

మునుగోడు : రైతులు తమ భూముల్లో ఆయిల్ పామ్ సాగుచేస్తే ప్రతినెలా ఆదాయం పొందవచ్చని హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ బి.బాబు పేర్కొన్నారు. బుధవారం మునుగోడు మండలంలోని కల్వపల్లి గ్రామంలో రైతు పగిళ్ల లింగస్వామి సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను ఆయన పరిశీలించి పలువురు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఎకరంలో మొక్కలు నాటితే ప్రతి నెలా రూ.4500 తగ్గకుండా ఆదాయం వస్తుందన్నారు. నల్లగొండ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనువైన భూములు ఉన్నాయని, ఇప్పటికే నాలుగు వేల ఎకరాల్లో సాగు చేశారని, మరో 6,100 ఎకరాల్లో సాగు చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్, ఏఓ పద్మజ, పతంజలి సంస్థ జిల్లా మేనేజర్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ టౌన్ : జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మించాలని కోరారు. కరువు పీడిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడం కోసం ఆనాడు కేసీఆర్ డిండి ఎత్తిపోతల పథకానికి హడావుడిగా శంకుస్థాపన చేశారని చెప్పారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా, ప్రాజెక్టు డీపీఆర్ ఆమోదించకుండా, ప్రాజెక్టుకు నీరు ఎక్కడి నుంచి తెస్తారో స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ నెల 15న దేవరకొండలో నిర్వహించిన సీపీఐ జిల్లా మహాసభలో తను జిల్లా కార్యదర్శిగా, సహాయ కార్యదర్శులుగా పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసి నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించడానికి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. మునుగోడులో కిష్టాపురం, గట్టుప్పల్, చిట్యాల మండలంలోని వెలిమినేడు ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఫార్మ కంపెనీలు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నారని దీన్ని అడ్డుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, నర్సింహ, రామచంద్రం, రామలింగయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఇదీ.. కాళేశ్వరం



కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపంపై బుధవారం సూర్యాపేటలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

లీజు పూర్తి.. గుంతలు అసంపూర్తి!



పూడ్చకుండా వదిలేసిన గుంతలు

మిర్యాలగూడ : దామరచర్లలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట ఓ సిమెంట్స్ పరిశ్రమయాజమాన్యం మైనింగ్ నిర్వహించిన ప్రాంతంలో గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. సదరు పరిశ్రమ రహదారికి వంద అడుగుల దూరంలో వాడపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని అటవీ, ప్రభుత్వ భూముల్లో నాపరాయి తవ్వకాల కోసం 35 ఏండ్ల క్రితం లీజుకు తీసుకుని.. 25 ఏళ్లపాటు తవ్వకాలు జరిపి మైనింగ్ నిర్వహించింది. 8 సంవత్సరాల క్రితం లీజు గడువు పూర్తికాగా మైనింగ్ నిలిపివేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గనుల ప్రదేశాలను మట్టితో పూడ్చిచెట్లను నాటి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ గుంతలను అలాగే వదిలేయడంతో ప్రస్తుతం అవి ప్రమాదకరంగా మారాయి. సుమారు వంద అడుగుల లోతు వరకు గోతులు ఉండడంతో వాటిలో నీరు చేరాయి. పశువులు, మూగ జీవాలు అందులోకి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నాయి. హైవే పక్కన గుంతలు ఉండడంతో అవి కనిపించకుండా చుట్టూ నాపరాయి గోడను నిర్మించారు. స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయగా అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోదాడ: అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంటున్న కారును బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద జరిగింది. కోదాడ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామానికి చెందిన ఈదా వెంకటేష్(23) మఠంపల్లి గ్రామంలో చేపల మార్కెట్ నిర్వహిస్తున్నాడు. బుధవారం వెంకటేష్ బైక్‌పై కోదాడకు వస్తుండగా.. పట్టణంలోని బాలాజీనగర్ కేఆర్ఆర్ కళాశాల వద్ద ఓ కారు డ్రైవర్ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో వెంకటేష్ బైక్‌తో కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ తండ్రి గోపయ్య ఫిర్యాదు మేరకు కోదాడ పట్టణ ఎస్ఐ సుధీర్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుకు గురై..

శాలిగౌరారం: పాముకాటుకు గురై వ్యక్తి మృతిచెందిన ఘటన శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారం గ్రామానికి చెందిన ఓర్సు సైదులు(38) బుధవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు తన ఇంటి సమీపంలో ఆరుబయటకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడిని కట్లపాము కాటు వేసింది. పామును సైదులు కర్రతో కొట్టి చంపేశాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి తనను పాముకాటు వేసిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే వారు సైదులును హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు గ్రామంలోని ఆటో స్టాండ్ వద్దకు రాగా.. అతడు స్పృహతప్పి కిందపడిపోయాడు. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడిని పిలిపించారు. అతడు వచ్చి సైదులును పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించాడు. మృతుడి తమ్ముడు ఓర్సు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

బాలికపై అత్యాచారం చేసిన నిందితుడి రిమాండ్

మర్రిగూడ: మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై శనివారం పోక్సో కేసు నమోదు కాగా.. బుధవారం దేవరకొండ డీఎస్పీ రవి ఆధ్వర్యంలో నిందితుడిని నల్లగొండ కోర్టులో రిమాండ్ చేశారు. ఆయన వెంట నాంపల్లి సీఐ డి. రాజు, ఎస్ఐ ఎం. కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది శంకర్‌రెడ్డి, హుస్సేన్, వాహీద్, సైదులు, యాదగిరి ఉన్నారు.

గానుగ నూనెతో ఆరోగ్యం



ఎద్దుతో గానుగ తిప్పుతున్న దృశ్యం

- నార్కట్‌పల్లి సమీపంలో వెలిసిన ఎద్దు గానుగ నూనె తయారీ కేంద్రం
- మంచి స్పందన ఉందంటున్న నిర్వాహకుడు



బాటిళ్లలో నింపిన గానుగ నూనె

నార్కట్‌పల్లి: ఇంట్లో ప్రతి వంటలో నూనె ఉపయోగిస్తుంటాం. ఈ నూనె కల్తీగా మారితే అనారోగ్యం బారిన పడక తప్పదు. పాత కాలంలో మాదిరిగా ప్రజలకు స్వచ్ఛమైన నూనె అందించాలని సంకల్పించారు నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ రేగట్టే భూపాల్‌రెడ్డి. గత మూడు నెలల నుంచి నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిలో నార్కట్‌పల్లి సమీపంలో తన వ్యవసాయ భూమిలో ఎద్దులతో గానుగ తిప్పి నూనె తయారు చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వర్కర్లు చూసుకుంటున్నారని, ఎద్దు గానుగతో పల్లీ, కొబ్బరి, ఆవాల నూనె తీస్తున్నట్లు పేర్కొన్నారు. 10 కిలోల పల్లీలు గానుగలో పోసి 4గంటల పాటు ఎద్దుతో తిప్పితే మూడున్నర లీటర్ల పల్లీ నూనె వస్తుందని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా 12 కిలోల ఎండు కొబ్బరి గానుగలో పోసి 8గంటల పాటు ఎద్దుతో తిప్పితే 4కిలోల కొబ్బరి నూనె వస్తుందని, 10 కిలోల అవాలు 8గంటల పాటు తిప్పితే 4కిలోల ఆవాల నూనె వస్తుందని చెబుతున్నారు. గానుగ రోలు నుంచి తిసిన నూనెను దాదాపు 5గంటల పాటు ఎండలో పెట్టడం వల్ల మడ్డి అడుగు భాగానికి పోయి తేలిక పాటి నూనె పైకి తేలుతుందని, ఆ నూనెను బాటిళ్లలో పోసి విక్రయిస్తుంటామని తెలిపారు. ప్రజల నుంచి మంచి స్పందన ఉందని పేర్కొన్నారు.

నూనె	ధర (లీటరుకు)
పల్లీ నూనె	రూ.350
కొబ్బరి నూనె	రూ.600
ఆవాల నూనె	రూ.600

రెండు నెలల నుంచి వాడుతున్నా

పల్లీ గానుగ నూనెను గత రెండు నెలల నుంచి వాడుతున్నాను. చాలా మంచిగా ఉంది. గతంలో వాడిన నూనె కన్నా ఈ నూనె చాలా తక్కువగా వాడుతున్నాం. ధర ఎక్కువైనా ఆరోగ్యానికి మంచిగా ఉంది. గానుగ నూనె వాడటం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావడం లేదు.

– మేకల రాజిరెడ్డి నార్కట్‌పల్లి

కల్తీ నూనె నివారించేందుకే..

కల్తీ వంట నూనె వాడటం వల్ల రోగాల బారిన పడుతున్న ప్రజలకు ఎద్దుతో తయారు చేసే గానుగ నూనెను అందించాలనే ఉద్దేశంతో ఈ గానుగ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. పల్లీలు తీసుకొస్తే ఉచితంగా గానుగ పట్టి నూనె తీసి ఇస్తాం. ఎక్కువగా వ్యాపారం చేయడానికి కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండేందుకు దీనిని ఏర్పాటు చేశాం. త్వరలో కల్తీ లేకుండా పసుపు, కారం కూడా తయారు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నాం.

– రేగట్టె భూపాల్‌రెడ్డి, ఎద్దు గానుగ నూనె కేంద్రం నిర్వాహకుడు

రోజూ 10 లీటర్లు విక్రయిస్తున్నా



రోజుకు రెండు సార్లు పల్లీలు రోలులో పోసి ఎద్దుతో గానుగ తిప్పుతున్నాను. పల్లీలు 10 కిలోల చొప్పున రెండు సార్లు పోయడం వలన 7లీటర్ల పల్లీ నూనె వస్తుంది. నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై వెళ్లే వారు ఎక్కువగా కొంటున్నారు. దాదాపు రోజూ 10 లీటర్ల పల్లీ నూనె విక్రయిస్తున్నాం. ఎప్పటికప్పుడు నూనె అమ్ముడవుతూనే ఉంది. నిల్వ ఉండడం లేదు.

– గండికోట ఎల్లయ్య, గుమాస్తా

రోజుకు 10 లీటర్ల పల్లీ నూనె విక్రయిస్తున్నామని, ఎక్కువగా నార్కట్‌పల్లి, నల్లగొండ, హైదరాబాద్, గుంటూరు వెళ్లే వారు కొనుగోలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు ఒప్పుకోం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి: ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ పెడితే ఒప్పుకునే ప్రసక్తే లేదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భువనగిరి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా నీటిని అక్కడి పాలకులు అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు రెండు పిల్లర్లు కాదు మొత్తం కూలిపోతుందని ఎన్‌డీఎస్ రిపోర్టు ఇచ్చిందన్నారు. మూడుసార్లు కేవలం మూడువేల ఓట్ల మెజారిటీతో సూర్యాపేటలో గెలిచిన గుంటకండ్ల జగదీష్‌రెడ్డి గురించి తాను మాట్లాడే స్థాయే కాదని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తద్వారా వచ్చే నెలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు అధిక మెజారిటీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. తమకు ఇంకా నలభై నెలల పాలన సమయం ఉందని, ఆ తర్వాత వచ్చే అరవై నెలలు కూడా తామే అధికారంలోనే ఉంటామని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

- మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామంలో ఘటన



సైదులు (ఫైల్)

మర్రిగూడ: మర్రిగూడ మండలంలోని మేటిచందాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందుర్తి గ్రామంలో బుధవారం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండల పరిధిలోని దామెర గ్రామ పంచాయతీకి చెందిన బత్తుల చంద్రమ్మ, నర్సింహ దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. వారి పెద్ద కుమారుడు బత్తుల సైదులు(25) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. బుధవారం మర్రిగూడ మండల పరిధిలోని ఇందుర్తి గ్రామంలో తన బంధువుల ఇంటికి సైదులు వచ్చాడు. ఈ క్రమంలో సైదులు స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు పరిశీలించగా క్రిమిసంహారక మందు తాగి మృతిచెందినట్లు గుర్తించారు. అయితే సైదులుది ఆత్మహత్య కాదని హత్యేనని అతడి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మర్రిగూడ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. కృష్ణారెడ్డి తెలిపారు.

పోలీసులను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

హాలియా: మద్యం మత్తులో హాలియా పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులతో దురుసుగా ప్రవర్తించి దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. ఈ నెల 15న అనుముల గ్రామానికి చెందిన బొడ్డుపల్లి మురళి మద్యం తాగి హాలియా పోలీస్ స్టేషన్‌కు వచ్చి విధుల్లో ఉన్న మహిళ కానిస్టేబుల్ జ్యోతిని అసభ్యంగా దూషించాడని, పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇతర పోలీస్ సిబ్బందిని, అక్కడ ఉన్న ప్రజలపై దురుసుగా ప్రవర్తించాడని ఎస్ఐ పేర్కొన్నారు. తనకు రాజకీయ బలముందని చెబుతూ బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. బొడ్డుపల్లి మురళిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా.. విచారణలో అతడిపై గతంలో 8 క్రిమినల్ కేసులు ఉన్నట్లు బయటపడిందని, ప్రస్తుతం అతనిపై రౌడీషీట్ నమోదు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులకు టోకరా

- రూ.20లక్షల వరకు వసూలు చేసిన నిందితుడు
- బాధితులు డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్న వైనం



నిరుద్యోగులకు అంటగట్టిన డూప్లికేట్ ఐడీ కార్డులు



నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, తాను కూడా అందులోనే ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్నానని ఓ వ్యక్తి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశాడు. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అధికార పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ నిరుద్యోగులకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. అతడిని నమ్మి ఏపీలోని విజయవాడకు చెందిన ఐదుగురు, నకిరేకల్, మిర్యాలగూడకు చెందిన మరికొందరు ఫోన్ పే ద్వారా, నగదు రూపంలో సుమారు రూ.20లక్షల వరకు ఇచ్చినట్లు సమాచారం. తీరా ఉద్యోగాలేవి అని నిరుద్యోగులు నిలదీయగా డూప్లికేట్ ఐడీ కార్డులు, అపాయింట్‌మెంట్ లెటర్లు సృష్టించి నిరుద్యోగులకు అంటగట్టాడు. వారు వాకబు చేయగా అవి నకిలీవని తేలడంతో మోసపోయామని గ్రహించారు. తమ డబ్బులు తమకు ఇవ్వాలని నిరుద్యోగులు అతడిని ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితులు వాపోయారు. వైటీపీఎస్ అధికారులను సంప్రదించగా.. సదరు వ్యక్తి వైటీపీఎస్‌లో ఉద్యోగం చేయడం లేదని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై డీఎస్పీ రాజశేఖర్ రాజును వివరణ కోరగా.. ఇప్పటివరకు ఎవరూ దీనిపై ఫిర్యాదు చేయలేదని, బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు



'అమ్మ చెక్కిన బొమ్మ' నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు



'ఇది రహదారి కాదు' నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం రెండో రోజు నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాలను ప్రారంభించారు. హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారు అమ్మ చెక్కిన బొమ్మ అనే నాటిక, హైదరాబాద్ మిత్రా క్రియేషన్స్ వారు ఇది రహదారి కాదు అనే నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్, ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి, సెక్రటరీ జిల్లా శ్రీశైలం, కోమలి కళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సెక్రటరీ ఎంఎల్. నర్సింహారావు, రఘుపతి, జీఎల్ కుమార్, వి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



559 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్: సాగర్ జలాశయంలో నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 559 అడుగులకు (230.0610 టీఎంసీలు) చేరింది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తి శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరడంతో నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. గత వారం రోజుల్లో 96 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయానికి 48,143 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా నిత్యం 68వేల క్యూసెక్కులకు పైచిలుకే నీటిని సాగర్ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. మరో 82 టీఎంసీల నీరు వచ్చి చేరితే సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం(590 అడుగులకు) చేరుకుంటుంది. ఇదే రీతిలో శ్రీశైలంలో విద్యుదుత్పాదన జరిగితే ఆ వరద నీటితో మరో 15 రోజుల్లో సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్ఎం శివకృష్ణ

రామగిరి(నల్లగొండ) : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శివకృష్ణ అన్నారు. బుధవారం నల్లగొండలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడులపై సలహాలు ఇస్తామని మోసగాళ్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటారని, అలాంటి వారిని నమ్మవద్దని సూచించారు. సులభంగా డబ్బులు రావనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ ప్రకటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని కోరారు. ఎస్‌బీఐ బీటీడీ ఏజీఎం ప్రశాంత్ మాట్లాడుతూ.. కస్టమర్లకు ఏమైనా సందేహాలు వస్తే ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జి. వెంకటేశ్వరరావు, బ్యాంకుల మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి సమీపంలో బుద్ధిస్ట్ థీమ్ పార్కు ఏర్పాటు



బుద్ధవనంలో ఖమ్మం జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి తదితరులు

నాగార్జునసాగర్: ఖమ్మం జిల్లా పరిధిలోని నేలకొండపల్లి బౌద్ధ స్థూపానికి సమీపంలో సుమారు 8 ఎకరాల్లో బుద్ధిస్ట్ థీమ్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయని ఖమ్మం జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి తెలిపారు. రాష్ట్ర ప్రజా సంబంధాల, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణమైన బుద్ధవనంలోని అన్ని విభాగాలు, జాతక పార్కు, బుద్ధచరితవనం, ధ్యాన వనం, స్థూపపార్కు, మహాస్థూపంపై చెక్కిన శిల్పాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ అధికారి శాసన ఉన్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి మోసం

- రూ.32 లక్షలతో ఉడాయించిన నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి అమాయక ప్రజల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఉడాయించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రాజశేఖర రాజు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన బండి సంధ్య 20శాతం, 30శాతం వడ్డీ ఇస్తామని ఆశ చూపి పట్టణంలోని తొమ్మిది మంది నుంచి రూ.32లక్షలు వసూలు చేసింది. అదేవిధంగా మిర్యాలగూడలోని సుందర్‌నగర్ కాలనీకి చెందిన అవిరెండ్ల అఖిల్‌తో కలిసి ఫ్రెండ్స్ లక్కీ డ్రా స్కీం ఏర్పాటు చేసి ప్రతినెల రూ.1000 15నెలలు కట్టించుకుని ప్రతి నెలా డ్రా తీసి కొంత మందికి రూ.15వేల విలువైన వస్తువులు ఇస్తామని డబ్బులు కట్టించుకున్నారు. డబ్బులు ఇచ్చిన వారు తమ డబ్బులు తమకు ఇవ్వాలని అడగగా.. సంధ్య, అఖిల్ తప్పించుకు తిరుగుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సంధ్య, అఖిల్‌పై కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో వన్ టౌన్ సీఐ మోతీరామ్, టూటౌన్ సీఐ సోమనర్సయ్య, ఎస్ఐ సైదిరెడ్డి, కానిస్టేబుళ్లు తదితరులున్నారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో టాక్సికాలజీ వ్యవస్థాపక దినోత్సవం



వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలోని ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ విభాగం 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినికల్ ప్రాక్టీస్‌లో తలెత్తే సమస్యలు, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్, వైద్యులు నితిన్‌జాన్, అభిషేక్ ఆరోరా, సంగీత సంపత్, రాజ్‌కోట్, సంజయ్‌గుప్తా పాల్గొన్నారు.

అటవీ వ్యవసాయం విస్తరించాలి

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత రామాంజనేయులు



మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త రామాంజనేయులు

బొమ్మలరామారం: సుస్థిర ఆదాయం పొందడానికి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా అటవీ వ్యవసాయం విస్తరించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత డాక్టర్ రామాంజనేయులు అన్నారు. బొమ్మలరామారం మండలం యావపూర్ గ్రామంలో బుధవారం అటవీ వ్యవసాయ పద్ధతులపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అటవీ వ్యవసాయంలో రైతులు లాభాలు పొందడానికి శ్రీగంధం, మామిడి, మలబారు వేప, కుంకుడు, నీలగిరి, మహాగని, అల్లనేరేడు, వెదురు, సీతాఫలం తదితర మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. అటవీ వ్యవసాయంలో మొక్కలను పెంచడంతో పాటు వాటి మధ్య గల ఖాళీ స్థలంలో పంటలు వేసుకోవడం, పశువులను పెంచడంతో సుస్థిర ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళిక ఆర్థిక సహాయంలో భాగంగా సీతాఫలం, వెదురు, మహాగని మొక్కలు, స్ప్రేయర్లు, కొమ్మలను కత్తిరించే సెకేచర్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమేష్, విజయలక్ష్మి, శ్రీలత, అనిల్‌కుమార్, యాదగిరిగుట్ట వ్యవసాయ సహాయ సంచాలకులు శాంతి నిర్మల, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, ఏఓ దుర్గేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

చదువుల తల్లిని ఆదుకోరూ..

- పుదుచ్చేరి యూనివర్సిటీలో సీటు సాధించిన ధనలక్ష్మి
- రూ.3లక్షలు ఖర్చువుతుండడంతో డబ్బుల్లేక పంపించని తల్లిదండ్రులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



పానుగోతు ధనలక్ష్మి

మిర్యాలగూడ: ఉన్నత చదువులు చదివేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థిని దాతల కోసం ఎదురు చూస్తోంది. వివరాలు.. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన పానుగోతు సైదానాయక్, సునీత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. సైదానాయక్ పాలిష్ మిల్లులో వర్కర్‌గా పనిచేస్తుండగా.. సునీత వ్యవసాయ కూలీ పనులు చేస్తూ నలుగురు పిల్లలను కష్టపడి చదివిస్తున్నారు. పిల్లల చదువు కోసం వారికి ఉన్న రెండున్నర ఎకరాలతో పాటు ఇంటి స్థలం సైతం అమ్ముకున్నారు. పెద్ద కూతురు మానసకు రెండేళ్ల క్రితం పంజాబ్ రాష్ట్రంలో ఐఐటీ–రోపర్‌లో సీటు రాగా.. ఆ అమ్మాయికి దాతలు ఆపన్నహస్తం అందించడంతో ఉన్నత విద్యను కొనసాగిస్తోంది. రెండో కుమార్తె ధనలక్ష్మి ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌లో ఎస్టీ కేటగిరిలో 3757వ ర్యాంకు సాధించి పుదుచ్చేరి యూనివర్సిటీలో సీటు సాధించింది. అయితే అక్కడకు వెళ్లి చదువుకునేందుకు రూ.3లక్షల వరకు ఖర్చు వస్తుండడంతో తమ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఆమెను అక్కడకు పంపించలేదని తండ్రి సైదా పేర్కొన్నాడు. తమ కుమార్తె కాలేజీకి వెళ్లకుండా ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంటుందని.. దాతలు ఆదుకుంటే తన రెండో కుమార్తె చదువు కొనసాగించే అవకాశం ఉందని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.